

పీఏబీఆర్ రెండు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పీఏబీఆర్‌లో తెరుచుకున్న మరో గేటు

రెండు గేట్ల నుంచి 1000 క్యూసెక్కుల నీరు విడుదల


కూడేరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)కు రెండో గేటు ఎత్తారు. ఆదివారం ఇరిగేసన్ డీఈఈ వెంకటరమణ, ఏఈఈలు లక్ష్మీదేవి, ముత్యాలప్ప, గంగమ్మ, రేణుక తదితరులు డ్యాం ప్రధాన రెండో గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో రిజర్వాయర్‌కు ఉన్న ఏడు గేట్లలో రెండుగేట్ల ద్వారా 1000 క్యూసెక్కుల నీరు మిడ్‌పెన్నార్ డ్యాంకు వదిలారు. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 435.900 మీటర్ల వద్దకు చేరుకొని 5.443 టీఎంసీల నీరు ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీ- నీవా నీరు 400 క్యూసెక్కులు, తుంగభద్ర డ్యాం నుంచి లింక్ చానల్ ద్వారా 150 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్ డ్యాంలోకి ఇన్‌ఫ్లో ఉందని తెలిపారు.

రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగడంతోపాటు, మరో రెండు రోజుల్లో తుఫాన్ ప్రభావం ఉండడంతో ముందస్తుగా డ్యాంలో రెండు గేట్లు ఎత్తినట్లు డీఈ పేర్కొన్నారు. జలవిద్యుత్ కేంద్రంలో కరెంటు ఉత్పత్తి తిరిగి ప్రారంభిస్తే రెండు గేట్లు బంద్ చేస్తామని అన్నారు. అంత వరకు పీఏబీఆర్ డ్యాం ప్రధాన గేట్ల నుంచి వస్తున్న నీటిని మిడ్ పెన్నార్‌కు మళ్లిస్తామని తెలిపారు.

బీటీపీ నాలుగు గేట్ల ఎత్తివేత

- పలు గ్రామాలకు రాకపోకలు బంద్

గుమ్మగట్ట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బీటీ ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక ప్రాంతం నుంచి నాలుగు వేల క్యూసెక్కుల వరద నీటి ఉధృతి కొనసాగుతతోంది. దీంతో ఆదివారం ఉదయం ప్రాజెక్టు నాలుగు గేట్ల ద్వారా 3,500 క్యూసెక్కుల నీటిని దిగువ హగరికి విడుదల చేశారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1655 అడుగులు కాగా, 1654 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటిని దృష్టిలో ఉంచుకుని దిగువకు వదులుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. దీంతో పాటు ఎడమకాలువ ద్వారా గుమ్మగట్ట, కల్లుగొడు, భూపసముద్రం చెరువులు నింపేందుకు 200 క్యూసెక్కుల నీటిని చెరువుకు వదిలారు. బీటీపీ వరదనీటి ప్రవాహంతో బ్రహ్మసముద్రం మండల పరిధిలోని 10 గ్రామాల ప్రజలకు రాయదుర్గం పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి వేపలపర్తి కాజ్‌వే పై పోలీసులు రాకపోకలు లేకుండా అడ్డు వేశారు. దీంతో ఇక్కడి ప్రజలు రాయదుర్గం చేరుకోవాలంటే 40 కిలో మీటర్లు బీటీ ప్రాజెక్టుపై వెళ్లాల్సి ఉంది. బీటీ ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఆదివారం మధ్యాహ్నం కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు పరిశీలించి బ్రహ్మసముద్రం, గుమ్మగట్ట పోలీసులను అప్రమత్తం చేశారు. తమకు వెసులుబాటు కల్పించాలని మత్స్యకారులు డీఎస్పీకి విన్నవించారు.



నాలుగు గేట్ల ద్వారా దిగువకు వెళుతున్న నీరు

ఎవరికి మొక్కాలి...?

పగబట్టిన ప్రకృతి.. దోచేస్తున్న దళారులు

- మద్దతు ధర రూ. 2,400.. దళారి ధర రూ.1700
- ఆందోళనలో మొక్కజొన్న రైతులు



తడిసిన మొక్కజొన్న



తడిసిన మొక్కజొన్నను ఆరబెడుతున్న రైతు

ఒకవైపు ప్రకృతి పగబట్టింది.. మరోవైపు దోచుకోవడానికి దళారులు కాచుకున్నారు. పంట బాగా పండిందని ఆనంద పడేలోపే ఆశలన్నీ ఆవిరైపోయాయి. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి మొక్కజొన్న రైతు తీవ్రంగా నష్టపోయాడు. ఆరబెట్టేందుకు కూడా నానా కష్టాలు పడుతున్నాడు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా కొనుగోలు కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఎవరికి మొక్కాలి దేవుడా అని దిక్కులు చూస్తున్నారు.

బొమ్మనహాళ్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో శ్రమించి మొక్కజొన్న పంటను కోత కోయగా.. ఒక వైపు ప్రకృతి, మరో వైపు దళారులు రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారు. వర్షాలతో తడిసిన మొక్కజొన్న పంటను ఆరబెట్టుకునేందుకు రైతుల నానా కష్టాలు పడుతున్నారు. ఆరబెట్టేందుకు కూలీలకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. మరోవైపు దళారులు ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా రైతులు రెండు వైపులా నష్టపోతున్నారు. బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట, దర్గాహొన్నూరు, గోవిందవాడ, శింగానహళ్లి, బొమ్మనహాళ్, ఉద్దేహాళ్ తదితర గ్రామాల్లో 6,465 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మంచి దిగుబడి వచ్చినా ధర లేక రైతులు విలవిల్లాడుతున్నారు. వర్షం తడిపింది, దళారులు దోచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా రెండు రోజుల క్రితం తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి తడిసిన మొక్కజొన్నను ఆరబెట్టడం రైతులకు తలనొప్పిగా మారింది. పంట తడవడం వల్ల నిల్వ చేయడానికి కూడా సౌకర్యాలు లేక కష్టాలు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ప్రకటించినా.. దళారులు రూ. 1700, 1800 కంటే ఎక్కువ ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను నట్టేట ముంచుతున్నారు. ఎకరాకు రూ. 30 వేలకుపైగా పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. మండలంలో తక్షణమే మొక్కజొన్న కొనుగుకోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అప్పులు తీరుతాయని ఆశపడ్డా..



గత ఏడాది కూతురు పెళ్లి చేశాను. పెళ్లి అప్పులు తీర్చేందుకు 5 ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగుచేశాను. కానీ వర్షాలు పంటను తడిపేశాయి. ఇప్పుడు దళారులు చెప్పిన ధరకు అమ్మితే పెట్టుబడి కూడా రాదు. మద్దతు ధరకు కొనుగోలు చేస్తేనే అప్పులు తీరుతాయి. లేదంటే కూతురు పెళ్లి అప్పులకు మరిన్ని అప్పులు తోడవుతాయి.

-చిన్న వంద్రప్ప, రైతు, దర్గాహొన్నూరు

కొనుగోలుకు నివేదిక పంపించాం



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసే దిశగా ఉన్నతాధికారులకు నివేదికను పంపించాం. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రతలు తీసుకోవాలి. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పంట తడిసిపోయి రైతులు ఇబ్బంది పడుతున్నారు. పంటను ఆరబెట్టే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించాం. పంట పాడుకాకుండా వెంటనే ఆరబెట్టే ఏర్పాట్లు చేసుకోవాలి. తడిసిన మొక్కజొన్నను నిల్వ చేయడం వల్ల పాడైపోయే అవకాశం ఉంది.

-సాయికుమార్, ఏవో, బొమ్మనహాళ్

కూలీలను పెట్టి ఆరబెడుతున్నాం



నా సొంత పొలం రెండు ఎకరాలతోపాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకోని మొక్కజొన్న పంట సాగు చేశాను. ఎకరాకు రూ. 30 వేలు పెట్టుబడి పెట్టాను. దళారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. వర్షానికి తడసిపోవడంతో కూలీలను పెట్టి ఆరబెట్టిస్తున్నా. రోజుకు ఇద్దరు అవసరం. ఒక్కొక్కరికి రూ. 500 కూలి ఇవ్వాలి. దిగుబడి బాగుంది, మద్దతు ధర బాగుంది. కొనుగోలు కేంద్రాలు లేకనే దళారులు ఇష్టారాజ్యంగా అడుగుతున్నారు.

-లింగప్ప, రైతు, దర్గాహొన్నూరు

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



ఆరు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాను. ఎకరాకు రూ. 30 వేలు పెట్టుబడి పెట్టాను. విత్తనం, ఎరువులు, మందులు, కూలీలకు ఖర్చులకు అప్పులు చేశాం. ఇప్పుడు అమ్మే ధర చూసి గుండె మండిపోతోంది. మద్దతు ధర అమలు చేయకపోతే రైతులు పూర్తిగా దెబ్బతింటారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

-గంగధర, రైతు, శింగానహళ్లి

ఆరోగ్యశ్రీ బకాయిలు దశల వారీగా చెల్లిస్తాం

- వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తాం
- మంత్రి సత్యకుమార్ యాదవ్



అనంతపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులకు పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బిల్లులను దశల వారీగా చెల్లిస్తామని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పెండింగ్ బిల్లుల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతపురంలో మంత్రి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చలు కొనసాగుతున్నాయన్నారు. వారి సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. వైద్య సేవలు ఎక్కడా ఆగవన్నారు. పెండింగ్ బిల్లులు దశలవారీగా మొత్తం చెల్లించడంపై ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆసుపత్రుల్లో ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓ పోస్టులు భర్తీ చేసేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తొలి ఉపప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఈనెల 31న అనంతపురంలో ఐక్యతామార్చ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సర్దార్ జయంతి ఐక్యతామార్చ్‌కి సంబంధించి పోస్టర్లను మై భారత్, బీజేపీ నాయకులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు.

బాలకృష్ణ గురించి మాట్లాడే ముందు

ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి

- వైఎస్ జగన్‌కు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హెచ్చరిక



అనంతపురం అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురించి మాట్లాడే ముందు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని వైఎస్ జగన్‌ను మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు హెచ్చరించారు. అసెంబ్లీకి నందమూరి బాలకృష్ణ తాగొచ్చారని జగన్ విమర్శించడంపై ఎంఎస్ రాజు తీవ్ర స్థాయిలో స్పందించారు. జగన్ వ్యాఖ్యలను ఖండించారు. ఆదివారం అనంతపురంలో ఎంఎస్ రాజు మీడియాతో మాట్లాడుతూ... బాలకృష్ణను ఉద్దేశించి జగన్ చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవడంతోపాటు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బాలకృష్ణపై అవాకులు, చవాకులు పేలితే అభిమానులెవరూ సహించే పరిస్థితి ఉండదన్న విషయం జగన్ గుర్తుంచుకోవాలన్నారు. సమాజంలో గౌరవ మర్యాదలు కలిగిన వ్యక్తిపై ఉద్దేశపూర్వకంగా బురద జల్లడం జగన్‌కు తగదన్నారు. మంచికి మారు పేరు బాలకృష్ణ అన్నారు. తన పనితాను చేసుకుపోయే మనస్తత్వం ఉన్న వ్యక్తి అన్నారు. తండ్రి పదవిని, పార్టీని అడ్డుపెట్టుకుని అక్రమాలు, దుర్మార్గాలకు పాల్పడే వ్యక్తి బాలకృష్ణ కాదని జగన్‌కు చురక అంటించారు. 'బాలకృష్ణ అసెంబ్లీకి తాగి వచ్చాడంటున్నావ్.. కదా.. మందు నువ్వు కలిపిచ్చావా' అని జగన్‌ను ప్రశ్నించారు. సైకో పోవాలి.. సైకిల్ రావాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ నినదించిన వారేనన్నారు. 'వైసీపీ పాలనలో తాగుబోతుల సంఘానికి అధ్యక్షుడు నువ్వు కాదా జగన్' అని నిలదీశారు. మద్యం తాగే వాళ్లు కూడా మాట్లాడని రీతిలో వైసీపీ పాలనలో మాట్లాడిన మాటలు గుర్తు లేవా అని నిలదీశారు. మరోసారి బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

సార్.. మీ టైం అయిపోయింది..!

- కొన్ని రోజుల్లో ట్రాన్స్‌ఫర్ తథ్యం
- సీఐల బదిలీపై చోటానేతల ప్రచారం
- నేరుగా అధికారులకే చెబుతున్న పరిస్థితి





బీకేఎస్ పోలీసుస్టేషన్

బుక్కరాయసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'అయిపోయింది సార్..! మీటైం అయిపోయింది. ఇంకొన్ని రోజుల్లో మీరు ట్రాన్స్‌ఫర్ గ్యారెంటీ' అంటూ కొందరు చోటా నాయకులు పోలీసు స్టేషన్‌కే వెళ్లి సీఐలకు చెబుతున్న సంఘటనలు నియోజకవర్గంలో జరుగుతున్నాయి. బదిలీల విషయం అధికారులకు తెలియక ముందే చోటా నాయకులకు చేరుతోంది. అంతేగాక ఫలానా వ్యక్తే ఇక్కడకు సీఐగా వస్తున్నాడని కూడా వారు చెబుతున్నారు. దీన్ని బట్టి పోలీసు వ్యవస్థపై రాజకీయ పెత్తనం ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. పోలీసు శాఖలో జరిగే అంతర్గత బదిలీల ప్రక్రియ బయటికి ఎలా వస్తున్నాయనే సందేహాలు కిందిస్థాయి సిబ్బందిని వేధిస్తున్నాయి. కాగా నియోజకవర్గంలో ముఖ్యనేత జిల్లా పోలీసు అధికారులకు కొంత మంది సీఐల పేర్లను సిఫారుసు చేసినట్లు తెలుస్తుంది. వాటి ఆధారంగానే కొంత మంది చోటానేతలు బదిలీలపై ప్రచారం చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం శింగనమల నియోజకవర్గంలో పనిచేస్తున్న ముగ్గురు సీఐలపై బదిలీ వేటు తప్పదని కొందరు బహిరంగంగానే చెబుతున్నారు. బుక్కరాయసముద్రం సీఐ పుల్లయ్య వచ్చి ఆరు నెలలు కూడా కాలేదు. ఈయన పనితీరుపై ఎలాంటి విమర్శలు రాలేదు. అయినా ఆయనపై వేటు పడుతుందని, ఆయన స్థానంలో నాగేష్‌బాబు వస్తున్నాడని ప్రచారం జోరుగా సాగుతోంది. శింగనమలకు సీఐగా రాగరిరామయ్య వస్తున్నాడని ప్రచారం చేస్తున్నారు. పుట్లూరు సీఐను కూడా బదిలీ చేసి మరో వ్యక్తిని తెస్తున్నారనే గుసగుసలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ ప్రచారాలను బట్టి విధుల్లో సామర్థ్యం కంటే నాయకుల పట్ల విధేయతే ముఖ్యమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆరు నెలలకే...!

బుక్కరాయసముద్రం అప్‌గ్రేడ్‌స్టేషన్‌లో సీఐలు కేవలం ఆరు నెలలకే బదిలీ అవుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 17న కడప జిల్లా నుంచి సీఐ పుల్లయ్య ఈ స్టేషన్‌కు వచ్చాడు. మండలంలో శాంతి భద్రతల నిర్వహణపై పట్టు సాధించడంలో నిమగ్నం అయ్యాడు. ఇంతలోనే గత రెండు, మూడు రోజుల నుంచి సీఐ బదిలీ అవుతున్నా డనే ప్రచారం జోరందుకుంది. గతంలో వచ్చిన సీఐ కరుణాకర్ ఏకపక్ష ధోరణి, పలు ఆరోపణలుతో ఏడు నెలలకే సస్పెండ్ అయ్యాడు. అంతకుముందు పని చేసిన సీఐ వెంకటేశ్వర్లుపై ఎలాంటి ఆరోపణలు లేకపోయినా రాజకీయ బదిలీ వేటు పడింది. అంతకు ముందు సీఐ నాగార్జునరెడ్డి దివ్యాంగుడిని కొట్టిన కేసుకు సంబంధించి విధులు చేపట్టిన ఆరు నెలలకే సస్పెండ్ అయ్యాడు. ఈయనకంటే ముందు సీఐగా పని చేసిన రాము లంచం డిమాండ్ చేయడంతో సస్పెండ్ అయ్యాడు. ఇలా ఇక్కడకు వచ్చిన సీఐలు కేవలం ఆరేడు నెలలకే వివిధ కారణాలతో బదిలీ, లేదా సస్పెండ్ అవుతున్నారు. మరి ప్రస్తుత సీఐను జరుగుతున్న ప్రచారం ప్రకారం బదిలీ చేస్తారా లేక ఉంచుతారా అన్నది మరి కొద్ది రోజుల్లో తేలనుంది. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం చేసిన రాజారెడ్డి కేసులో పుట్లూరు సీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించాలరనే కారణంగా బదిలీ వేటు పడే అవకాశం ఉందని సమాచారం.

మా దృష్టికి రాలేదు



శింగనమల నియోజకవర్గంలోని పోలీసు శాఖలో పనిచేసే సీఐలు బదిలీలు వ్యవహారం మా దృష్టికి రాలేదు. ఏదైనా ఉంటే మా ఉన్నతాధికారులు అంతర్గతంగా బదిలీ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఇలా రాజకీయ నేతలు బయటికి చెప్పడం సరికాదు. విధి నిర్వహణలో వారి పనితీరు బట్టి బదిలీలు ఉంటాయి. బదిలీలు విషయం ఇప్పటి వరకు నా దృష్టికి రాలేదు.

-వెంకటేశులు, అనంతపురం రూరల్ డీఎస్పీ

పెద్దాస్పత్రిలో చోద్యం..!

- ఆదివారం ల్యాబ్‌కు సెలవు
- రెండు రోజులుగా నిరీక్షిస్తున్న రోగులు
- వ్యాధి నిర్ధారణకాక అలస్యమౌతున్న వైద్యం



తాళం వేసిన మైక్రో బయాలజీ ల్యాబ్ గది

అనంతపురం వైద్యం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగ నిర్ధారణ పరీక్షలకు ఆదివారం సెలవు ఇస్తున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి సోమవారం ఉదయం వరకు మైక్రోబయాలజీ ల్యాబ్‌ను మూసివేస్తున్నారు. దీంతో రెండు రోజులపాటు సంబంధిత విభాగ రక్తపరీక్షలు చేయించుకోవాలంటే నిరీక్షించాల్సి వస్తోందని రోగులు, వారి బంధువులు వాపోతున్నారు. అత్యవసర విభాగం, ఏఎంసీ, చిల్డ్రన్, మెడిసిన్, సర్జికల్ తదితర వార్డుల్లో అడ్మిషన్ అయ్యే రోగులకు హెచ్‌బీఎస్ఏజీ, హెచ్‌సీవీ, సీఆర్పీ వంటి రక్తపరీక్షలు నిలిచిపోతున్నాయి. దీంతో వ్యాధినిర్ధారణలేక చికిత్సలు ఆలస్యమౌతున్నాయని వాపోతున్నారు.

ఆలస్యమౌతున్నా...


రోగులను వార్డుల్లో అడ్మిషన్ చేసుకున్న డాక్టర్లు తక్షణ వైద్యసేవలు ప్రారంభిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ కోసం బయోకెమిస్ట్రీ, పెథాలజీ, మైక్రో బయాలజీ విభాగాలకు రక్తపరీక్షల రిక్విజేషన్స్ రాసి పంపుతున్నారు. బయోకెమిస్ట్రీ, పెథాలజీ విభాగాలకు సంబంధించిన ల్యాబ్‌లలో అప్పటికప్పుడే పరీక్షలు నిర్వహిస్తున్నారు. గంట సమయంలో రిపోర్టులు కూడా రాసిపంపుతున్నారు. మైక్రోబయాలజీ ల్యాబ్‌లో నిర్వహించాల్సిన హెచ్‌బీఎస్ఏజీ, హెచ్‌సీవీ, సీఆర్పీ తదితర రక్తపరీక్షలు ఆలస్యమౌతున్నాయి. సోమవారం నుంచి శనివారం వరకు సాయంత్రం 4గంటలు అయితే చాలు.. మైక్రోబయాలజీ విభాగంలో పరీక్షలు చేయడంలేదు. ఆదివారం పూర్తిగా బంద్. దీంతో రోగులకు సరైన వైద్యం అందించడంలేదని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.

ల్యాబ్‌ను మూసివేశారు: మహ్మద్ షారూక్, చిన్నారి తండ్రి



ఏడాది వయసున్న నా కూతురు విరేచనాలతో బాధపడుతోంది. శనివారం ఆస్పత్రికివచ్చి అడ్మిషన్ అయ్యాం. డాక్టర్లు రక్తపరీక్షలకు రాసిచ్చారు. ట్యూబుల్లో రక్తంతీసీ ల్యాబ్‌కు ఇచ్చిరావాలని సూచించారు. పెథాలజీ, బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లు ఉన్నాయి. వాటిలో పరీక్షలు చేసి, రిపోర్టులిచ్చారు. మైక్రోబయాలజీ ల్యాబ్‌ను మూసివేడయంతో సీఆర్పీ అనే టెస్ట్ నిలిచిపోయింది. సోమవారం ఉదయం చేస్తారని చెప్పారు. దీంతో మళ్లీరక్తం తీయాలంటే సూది గుచ్చాల్సిందే.

ఎమర్జెన్సీవి మాత్రమే చేస్తున్నారు



సర్జరీ చేసే ఎమర్జెన్సీ కేసులకు మాత్రమే మైక్రోబయాలజీకి సబంధించిన హెచ్‌బీఎస్ఏజీ, హెచ్‌సీవీ, హెచ్ఐవీ టెస్టులను ర్యాపిడ్‌కిట్ ద్వారా చేస్తున్నారు. 24గంటలు ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించేలా వైద్యవిద్య కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడతాం. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

-డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్

రేపు శాసనసభ కమిటీ పర్యటన

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఏపీ శాసనసభ కమిటీ ఈనెల 28వతేదీ జిల్లాలో పర్యటిస్తుందని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఈనెల 28న ఉదయం 9.30గంటల నుంచి 11గంటల వరకు అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు ఇచ్చే వినతి పత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జిల్లా అధికారులతో సమావేశమవుతారని వివరించారు. సమావేశంలో సంక్షేమ పథకాలు అమలు, పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ సేవలలో రిజర్వేషన్ల అమలు, షెడ్యూల్డ్ కులాలకు సంబంధించి ఇతర అంశాలను సమీక్ష నిర్వహిస్తారన్నారు. శాసనసభ కమిటీ అధ్యక్షుడు కుమార్ రాజా వర్ల, శాసనసభ సభ్యులు కొండ్రు మురళీమోహన్, కొలికపూడి శ్రీనివాసరావు, తాటిపర్తి చంద్రశేఖర్, దేవి వరప్రసాద్, బోనెల విజయచంద్ర, ఎమ్మెస్ రాజు, రోషన్‌కుమార్ సొంగ, బీఎన్ విజయ్‌కుమార్, శాసన మండలి సభ్యులు కావలి గ్రీష్మప్రసాద్, బొమ్మి ఇస్రాయెల్, మురళీధర్ మెరిగలు ఉంటారని తెలిపారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు, షెడ్యూల్ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు ఏపీ శాసనసభ కమిటీ సభ్యులకు ఫిర్యాదులు, వినతిపత్రాలు సమర్పించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని, సమష్టి కృషితో పరస్పర సమన్వయంతో శాసనసభ కమిటీ పర్యటనను జయప్రదం చేయాలని సూచించారు.

475 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

అనంతపురం అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 475 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌లో వ్యాగిన్లలో వచ్చిన యూరియాను ఏడీఏ పరిశీలించారు. ఏపీ మార్క్‌ఫెడ్‌కు 325, డీలర్లకు 150 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

ఆర్చరీ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన ఆర్చర్లు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం జిల్లా ఆర్చరీ సబ్‌జూనియర్స్ బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఇండియన్ రౌండ్ విభాగంలో ధృవరెడ్డి, యజ్ఞరూప్ యాదవ్, పవన్‌కేశవ రెడ్డి, మిథున్, అయాన్, భీమేష్, లేక్యన్యరెడ్డి, తీక్షిత్, మనోజ్ఞ, వందన, తరుణిక, మణ్యశ్రీ ఎంపికయ్యారు. రికర్వ్ రౌండ్ విభాగంలో యోగేష్, ప్రజ్వల్, మహబూబ్‌బాషా, సాయిస్వరూప్, సంతోష్, గుణశ్రీ, శ్రీలేఖ, నిఖిత, ఆడియా ప్రియదర్శిని, ప్రియదర్శిని చోటు దక్కించుకున్నారు. కాంపౌండ్ విభాగంలో కార్తీక్, సల్మాన్, సూర్య, శ్యామ్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 1వతేదీ నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు నళిని, లక్ష్మీదేవి, రాహుల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యువ కవికి లేపాక్షి ఫౌండేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కాశీవిశ్వనాథ్

ధర్మవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన యువకవి గురు కాశీవిశ్వనాథ్‌కు లేపాక్షి ఫౌండేషన్ అవార్డు దక్కింది. నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ యువకవి వడ్డి సుధాకర్ అధ్యక్షతన శనివారం తెలుగు సాహిత్యకళా ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో కాశీవిశ్వనాథ్ కవిత చదివి వినిపించారు. కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గండిశెట్టి శివకుమార్ యువకవికి లేపాక్షి ఫౌండేషన్ అవార్డు అందజేసి సత్కరించారు.

మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేయాలి

అనంతపురం విద్య, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మద్దతు ధరతో మొక్కజొన్న పంటను రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, అధ్యక్షుడు చెన్నయ్య యాదవ్ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంత వరకు క్వింటాలు రూ.2,300 ఉన్న ధర ప్రస్తుతం రూ.1700కు పడిపోయిందని అన్నారు. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు సైతం అందక అప్పులపాలు కావాల్సి వస్తోందన్నారు. వేరుశనగ పంటకు కూడా గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పప్పుశనగ విత్తనాన్ని 90 శాతం సబ్సిడీతో అందించాలని కోరారు.

ఎమ్మెల్యే అమిలినేని మానవత్వం

రోడ్డుపై పడి ఉన్న వ్యక్తికి సాయం

ఆసుపత్రికి తరలించి చికిత్సలు



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై పడి ఉన్న ఓ వ్యక్తికి సాయం అందించి.. ప్రాణాలు కాపాడి మానవత్వం చాటుకున్నారు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు. ఆదివారం కళ్యాణదుర్గం మండల పరిధిలోని తూర్పుకోడిపల్లిలో వాల్మీకి విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే కాన్వాయ్‌తో వెళుతున్నారు. పట్టణంలోని రింగ్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి అచేతనంగా పడిఉన్నాడు. గమనించిన ఎమ్మెల్యే తన కాన్వాయ్‌ను ఆపి, వెంటనే ఆ వ్యక్తి దగ్గరకు వెళ్లి మాట్లాడే ప్రయత్నం చేశారు. ఆ వ్యక్తి మాట్లాడలేకపోయాడు. వెంటనే తన వ్యక్తిగత సిబ్బందితో ఆ వ్యక్తికి నీళ్లు తాగించి, మాట్లాడే ప్రయత్నం చేశారు. కాసేపటికి ఆ వ్యక్తి మాట్లాడాడు. తన పేరు సురేష్ అని, మదనపల్లి నుంచి వచ్చానని, అనారోగ్యం కారణంగా ఇలా రోడ్డుపై పడిపోయానని తెలిపాడు. వెంటనే ఎమ్మెల్యే ప్రత్యేక వాహనం తెప్పించి, కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి ఆ వ్యక్తిని తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. సకాలంలో ఆసుపత్రికి తరలించి వైద్యం అందించడంతో ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

బుక్కరాయసముద్రం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలో చోరీల పరంపర కొనసాగుతోంది. శనివారం అర్ధరాత్రి మండలంలోని ఎస్ కొండాపురం గ్రామంలో గల ముత్యాలమ్మ ఆలయంలో దొంగలు పడ్డారు. అమ్మవారి ఆభరణాలు దాదాపు 70 వేలు విలువ చేసే 55 తులాల వెండి, హుండీలో ఉన్న రూ.20వేల మేర నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు.. ఆదివారం ఉదయం ఆలయాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. చోరీపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



మల్లయ్య (ఫైల్)

యాడికి, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో ఆదివారం ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొట్టడంతో పుల్లయ్య (53) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాయలచెరువుకు చెందిన పుల్లయ్య స్థానిక ఆదర్శ పాఠశాలలో నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తుండేవాడు. ఆదివారం రాత్రి స్కూటీలో విధులకు వెళ్తుండగా వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో పుల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఆపకుండా వెళ్లిపోతున్న బొలెరో వాహన డ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. పుల్లయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదేళ్ల బాలుడు అదృశ్యం



అదృశ్యమైన బాలుడు (ఫైల్)

అనంతపురం క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐదేళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు త్రీటౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక అరుణోదయకాలనీకి చెందిన గోవిందు, అతడి భార్య శనివారం రాత్రి పని మీద బయటకు వెళ్లారు. బాబు నిద్రపోతుండటంతో.. ఇంట్లోనే ఉంచి సుమారు 20 నిమిషాల్లో పనినిమిత్తం వెళ్లి వచ్చేద్దామని వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూస్తే... బాబు కనిపించలేదు. బాలుడి తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. బాలుడు కనిపించకుండా పోయినపుడు స్కైబ్లూ కలర్ టీషర్ట్, గ్రీన్ కలర్ నిక్కర్ ధరించి ఉన్నాడు. బాలుడి ఆచూకీ తెలిస్తే 9490618679, 9346917115 నంబర్లలో సమాచారం ఇవ్వాలని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.22

అనంతపురంరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో ఆదివారం కిలో టమోటాలు గరిష్ఠంగా రూ.22తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9తో, సరసరిగా రూ.15తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1350 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

బడిలోనే భవితకు భరోసా..!

- పాఠశాల స్థాయిలో వృత్తి విద్యాకోర్సులు
- 73 పాఠశాలల్లో.. 9 రకాల కోర్సులకు శిక్షణ
- సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పర్యవేక్షణ



శిక్షణకు హాజరైన వృత్తి విద్యాకోర్సుల శిక్షకులు

అనంతపురం విద్య, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితులలో చదువు ఒక్కటే ఉపాధి అవకాశాలు పూర్తిస్థాయిలో కల్పించలేకపోతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు చదువుతో పాటు వృత్తి విద్యాకోర్సులలో నైపుణ్యాలు నేర్పించాలని చర్యలు చేపట్టారు. వృత్తి విద్యా కోర్సులు నేర్చుకోవడం వల్ల పైచదువులకు ఉపయోగపడడంతో పాటు జీవితంలో స్వయం ఉపాధి పొందడానికి తోడ్పడుతాయి. ప్రభుత్వం వీటికి ప్రాధాన్యం ఇస్తూ.. అవసరమైన వసతులు, పరికరాలు, శిక్షకులను ఏర్పాటు చేసింది.

73 పాఠశాలల్లో అమలు

అనంత జిల్లాలో అధికారుల సమాచారం మేరకు 73 పాఠశాలల్లో వృత్తి విద్యాకోర్సులు అమలు చేస్తున్నారు. ఇందులో 19 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, 15 ఏపీ మోడల్ స్కూల్స్, ఆరు ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐ స్కూళ్లు, 24 ఎంపీపీ, జడ్పీ స్కూళ్లు, రెండు మున్సిపల్, నాలుగు గవర్నమెంట్ సూళ్లు ఉన్నాయి. ఏపీఆర్‌ఈఐ సొసైటీ స్కూల్, ఏపీటీడబ్ల్యుఆర్‌ఈఐస్కూల్, బీసీవెల్ఫేర్ స్కూల్ ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. 9వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇస్తారు.

9 కోర్సులు.. 127 మంది శిక్షకులు

వృత్తి విద్యా కోర్సులు అమలు చేస్తున్న 73 పాఠశాలలో.. 9 రకాల కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఆటోమోటివ్, అపెరల్, బ్యూటీ అండ్‌వెల్నెస్, రిటైల్ వ్యాపారం, ఎలక్ట్రానిక్స్, హెల్త్‌కేర్, ఐటీ, ఆహార శుద్ధి, బీఎఫ్‌ఎస్‌ఐ అంశాలలో ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. వృత్తి విద్యాకోర్సులలో నైపుణ్యాలు పెంచడం కోసం ప్రత్యేకంగా 127 మంది శిక్షకులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ 73 పాఠశాలల్లో 13,298 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. సమగ్రశిక్ష శాఖ ఈ కోర్సులకు అవసరమైన వసతులు, పరికరాలు, శిక్షకులను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తోంది.

జీవిత ప్రయాణానికి ఉపయుక్తం



బాలబాలికల జీవిత ప్రయాణానికి ఈ వృత్తి విద్యాకోర్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. అందుకే ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే వీటిని తీసుకొచ్చింది. జిల్లాలో 73 స్కూళ్లలో వీటిని నిర్వహిస్తున్నాం. చదువు పూర్తయ్యేసరికి ఈ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకొని ధ్రువపత్రాలతో బయటకువస్తారు. వీటి ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

-శైలజ, ఏపీసీ, సమగ్రశిక్ష

బ్యూటీ కోర్సుతో ఉపాధి



బాలికలకు ప్రస్తుత సమయంలో బ్యూటీ వెల్నెస్ ఒకేషనల్ కోర్సు ఎంతో ఉపయోగం. వారు తమ పరిసర ప్రాంతాల్లోనే బ్యూటీ పార్లర్, లేడీస్‌కార్నర్, ఫ్యాన్సీ షాపులు పెట్టుకొని ఉపాధి పొందవచ్చు. ఇంట్లోనే ఉంటూ వీటిని నడుపుకోవడానికి అవకాశం ఉంటుంది. అందుకే ఈ కోర్సుల పట్ల అమ్మాయిలు ఆసక్తి చూపుతున్నారు. మేము కూడా అదేస్థాయిలో శిక్షణ ఇస్తున్నాం.

-సుజాత, బ్యూటీ శిక్షకురాలు, రాయదుర్గం

కంప్యూటర్ స్కిల్స్ అవసరం



ప్రస్తుత సాంకేతిక రంగంలో కంప్యూటర్ స్కిల్స్ చాలా అవసరం. అందుకే ప్రభుత్వం ఐటీ కోర్సులను అమలుచేస్తోంది. విద్యార్థులకు ఐటీ రంగంలో నైపుణ్యం నేర్పించడం వల్ల స్కూల్ స్థాయి నుంచే అవగాహన ఏర్పడుతుంది. డిప్లమో, బీటెక్, డిగ్రీ చేరిన తర్వాత ఈ కోర్సులు ఎంతో ఉపయోగపడతాయి. వృత్తి విద్యా కోర్సుల వల్ల విద్యార్థులు తమ సొంతకాళ్లపై నిలబడడానికి అవకాశం ఉంటుంది.

-నిరంజన్‌రెడ్డి, శిక్షకుడు

స్థానిక ఎన్నికల్లో వడ్డెర్లకు ప్రాధాన్యం

మంత్రి సవిత

గోరంట్లలో ఘనంగా వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ



వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

హిందూపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు పార్టీ నామినేటెడ్ పదవుల్లో వడ్డెర్లకు ప్రాధాన్యత కల్పిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. గోరంట్లలో ఏర్పాటు చేసిన వడ్డె ఓబన్న విగ్రహాన్ని మంత్రి సవిత.. వడ్డెర్ల సంఘం నాయకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. బీసీలకు టీడీపీతోనే రాజకీయ, ఆర్థిక, సామాజికంగా ప్రాధాన్యత లభిస్తుందన్నారు. రేనాటి యోధుడు, ఆంగ్లేయుల దాష్టీకాలను ఎదురించి మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటానికి నాంది పలికిన వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. బీసీల అభ్యున్నతికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. క్వారీ కేటాయింపుల్లో వడ్డెర్లకు 15 శాతం రిజర్వేషన్‌తోపాటు సీనరేజ్ ఫీజులపై 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. వడ్డెర్లను ఎస్సీల జాబితో చేర్చే అంశం చంద్రబాబు దృష్టిలో ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్‌రావు, వడ్డెర సాధికారత రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి, నేతలు హనుమయ్య, శ్రీనివాసులు, నవీన్ పాల్గొన్నారు.

అట్టహాసంగా సిమ్స్ మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి ప్రారంభం





ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎంపీ, ఎమ్మెల్యేలు

అనంతపురంరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సాయినాథ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్) మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి ప్రారంభోత్సవం అట్టహాసంగా సాగింది. అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్‌లో ఆదివారం ఆస్పత్రిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు, గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, కదిరి మాజీ ఎమ్మెల్యే సిద్ధారెడ్డి తదితరులు ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలు, ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. జిల్లాలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆస్పత్రిని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఆస్పత్రి డైరెక్టర్లు డా.స్వరూపారెడ్డి, అశ్వత్థరెడ్డి, ఉషారాణి, సునీత, సంజనారెడ్డి, అభినవ్‌రెడ్డి, ప్రణీత, వసంతలక్ష్మి, చెన్నకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ప్రధాన ఉద్దేశంతో 300 పడకల ఆస్పత్రిని ప్రారంభించామన్నారు. ఎనిమిది మాడ్యులర్ లామినార్ ఫ్లో ఆపరేషన్ థియేటర్లు, వంద పడకల ఐసీయూ సౌకర్యం, 20 పడకల నియోనేటల్, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఏర్పాటు చేశామన్నారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

ఏఎస్పీ రోహిత్ కుమార్

బాధితుల కుటుంబాలకు పరామర్శ



అమరవీరుడి కుటుంబికులను పరామర్శిస్తున్న ఏఎస్పీ

అనంతపురం క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఇతర పోలీస్ అధికారులతో కలసి జిల్లా కేంద్రంలోని పలువురు పోలీస్ అమరవీరుల కుటుంబాలను పరామర్శించారు. వారిని సన్మానించి, అండగా ఉంటామని భరోసా నింపారు. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన హనుమంతరెడ్డి ఉమ్మడి ఏపీలోని గ్రేహౌండ్స్ విభాగంలో జూనియర్ కమాండోగా పనిచేస్తూ..2008లో ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో బలిమెల ఘటనలో అమరుడయ్యాడు. ఆయన భార్య స్రవంతి స్థానిక ఆదిమూర్తి నగర్‌లో ఉంటూ... జిల్లా పోలీస్‌శాఖలో పనిచేస్తోంది. దీంతో ఏఎస్పీ వారి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందించారు. హనుమంతరెడ్డి సేవలను కొనియాడారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మీ కుటుంబానికి పోలీస్‌శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతపురం టూటౌన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నారాయణనాయక్ ఈ ఏడాది జనవరి 17న రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన భార్య శాంతబాయి, ఇతర కుటుంబసభ్యులు ఆకుతోటపల్లిలో ఉంటున్నారు. ఏఎస్పీ, ఇతర అధికారులు వారి ఇంటికి వెళ్లి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఏవైనా ప్రయోజనాలు అందాల్సి ఉంటే ఎస్పీ జగదీష్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, సీఐ శ్రీకాంత్, ఆర్ఐ పవన్‌కుమార్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, హరినాథ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వద్దన్నా డీజే.. టీడీపీ నేతలపై కేసు

ఆలస్యంగా వెలుగులోకి..

అనంతపురం క్రైం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): నగరంలో పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉన్న సమయంలో డీజే పెట్టకూడదని హెచ్చరించినా.... డీజే పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారంటూ పలువురు టీడీపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. 9 మంది టీడీపీ ముఖ్య నాయకులతో పాటు మరికొందరిపై ఈ నెల 3వ తేదీ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... ఈ నెల 3వ తేదీ సుభాష్ రోడ్డులోని టౌన్ అర్బన్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జనం వేళ టీడీపీ నాయకులు డీజే ఏర్పాటు చేశారు. ఉత్సవ మండపం వద్ద అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళి, టీడీపీ నేత రాయల్ మురళి, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు క్రిష్ణకుమార్, సుంకర రమేష్, చెన్నప్ప, లోకనాథ్, అనిల్, జయ, మధుసూదన్ గౌడ్‌తోపాటు మరికొందరు ఐచర్‌లో డీజే ఏర్పాటు చేసుకున్నారు. దుర్గాదేవి విగ్రహాన్ని మరో వాహనంలో పెట్టుకుని డీజేతో నగరంలో ఊరేగింపు నిర్వహించారు. నగరంలోని 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ట్రాఫిక్‌కు ఇబ్బంది అవుతుందని పోలీసులు వారించినా... డీజే పెట్టకూడదని హెచ్చరించినా...వాళ్లు ఊరేగింపు కొనసాగించారు. ఈ ఘటనపై అదేరోజు టూటౌన్ ఏఎస్ఐ శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఘటనపై 9 మంది టీడీపీ నాయకులతోపాటు, మరికొందరిపై అదే రోజు కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను ఆంధ్రజ్యోతి ఆదివారం ఆరా తీయగా.. కేసు నమోదు చేసింది నిజమేనని ఆయన స్పష్టం చేశారు.

వాల్మీకి జీవనమార్గాలను అనుసరించండి

ప్రభుత్వ విప్ కాలవ, ఎంపీ అంబికా

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



విజయ సంకేతం చూపుతున్న నూతన ఉపాధ్యాయులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): వాల్మీకి వారసులుగా ఆయన బోధనలు, సూచించిన జీవన మార్గాలను అనుసరించాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం ఎన్జీఓ హోంలో వాల్మీకి, బోయ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అక్షర జ్ఞానం లేక దశాబ్దాలుగా అనేక అవమానాలు, చీత్కారాలను ఎదుర్కొని నేడు సమాజానికి ఉపయోగపడే స్థాయిలో వాల్మీకి, బోయలు ఎదుగుతుండటం గర్వంగా ఉందన్నారు. తాజాగా జరిగిన డీఎస్సీలో జిల్లా స్థాయిలో నాలుగు విభాగాల్లో వాల్మీకి బోయలు మొదటి స్థానంలో నిలవడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఐకమత్యంతో ఒకరికొకరు చేదోడువాదోడుగా నిలుస్తూ సమాజాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే కర్తవ్యాన్ని అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. అనంతరం డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన జిల్లాకు చెందిన 60 మంది వాల్మీకి బోయ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్‌సీ అక్కులప్ప, నాయకులు వరప్రసాద్, పవన్‌కుమార్, భాగ్యరాజు, శంకర్‌నారాయణ, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, మలోబన్న, బాలకదిరప్ప, సంగప్ప, రవికుమార్, ఫణి, మంజు, వాల్మీకి ఉద్యోగులు, వాల్మీకి సంఘం నాయకులు బ్రహ్మయ్య, కొండపల్లి అక్కులప్ప, కార్పొరేటర్ రవి, బీసీ సంఘం నాయకులు సాకే నరేష్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల విజేత అనంతపురం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల విజేతగా అనంతపురం జట్టు నిలిచింది. ఆదివారం స్థానిక జీసెస్ నగర్‌లోని జయమణెమ్మ కల్యాణమండపంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. జూనియర్ బాలుర విభాగంలో గౌతమ్ (అనంతపురం), శివరామ్ (కర్నూలు), జ్యోతినివాస్ (అనంతపురం) మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో శ్రీవల్లి (అనంతపురం), హరిణి (అనంతపురం), ప్రవల్లిక (విశాఖ పట్నం) విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు అఖిల్, భగత్, శాంతరాజ్, రామాంజి, తులసి వెంకటేష్, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రామకృష్ణారెడ్డి

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. ఆదివారం కర్నూలులో ఏపీ రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్-2025 పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్-6 బాలురలో సంతోష్ 4వ స్థానం, అండర్12 బాలికల విభాగంలో వెనీషా 4వ స్థానం, అండర్-14 బాలుర విభాగంలో నితీష్ 5వ స్థానం, అండర్-10 బాలికల విభాగంలో జనని, బాలుర విభాగంలో నిహాల్, శ్రీనిక్ రక్షన్ 8వ స్థానాల్లో నిలిచారు. టోర్నీ డైరెక్టర్ శ్రీనివాస్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. సీనియర్ చెస్ కోచ్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్‌నాయుడు విజేతలను అభినందించారు.



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

గార్లదిన్నె, అక్టోబరు 26(ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోటంక గ్రామంలో గల గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే ఆలయంలోని మూలవిరాట్ కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించి తీర్థప్రసాలు స్వీకరించారు. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

బాస్కెట్‌బాల్ ప్లేయర్లకు టీచర్ పోస్టులు


పద్మావతి


నందిని


ప్రకాష్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26(ఆంధ్ర జ్యోతి): ముగ్గురు బాస్కెట్ బాల్ ప్లేయర్లు ఇటీవల డీఎస్సీలో టీచర్ పోస్టులు సాధించారు. ఉమ్మడి జిల్లాలో బాస్కెట్‌బాల్ క్రీడలో రాణించి స్పోర్ట్స్ కోటా కింద పీఈటీలుగా ఉద్యోగం సాధించారు. ధర్మవరం మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన పద్మావతి డీఎస్సీలో 66వ ర్యాంకు సాధించి కుందుర్పి మండలం బసాపురం జెడ్పీ హైస్కూల్‌లో పీఈటీగా విధుల్లో చేరారు. అలాగే కనగానపల్లి మండలం మామిళ్లపల్లికి చెందిన నందిని 116వ ర్యాంకు సాధించి రొళ్ల మండలం కాకి గ్రామ జెడ్పీ హైస్కూల్లో పీఈటీగా విధుల్లో చేరారు. నార్పల మండలం వెంకటంపల్లికి చెందిన ప్రకాష్‌రెడ్డి స్పోర్ట్స్ కోటాలో 92వ ర్యాంకుతో పీఈటీ పోస్టును సాధించి బొమ్మనహాల్ మండలం గోవిందవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. డీఎస్సీలో పోస్టులు సాధించిన బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి అభినందనలు ఆదివారం తెలిపారు. స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో కాలువలో పూడికతీత

- ఆయకట్టు భూములకు సాఫీగా సాగునీరు
- హర్షం వ్యక్తం చేసిన రైతులు


కల్లూరు వద్ద కాలువలో పూడికను తీస్తుండడంతో పారుతున్న సాగునీరు

గార్లదిన్నె, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ చొరవతో మండలంలోని కల్లూరులో ఆయకట్టు భూములకు కాలువ నుంచి సాగునీరు సాఫీగా సరఫరా అయ్యేలా స్థానిక టీడీపీ నాయకులు చర్యలు చేపట్టారు. ఆ గ్రామంలోని సింగరప్ప స్వామి ఆలయం సమీపంలో గల పెన్నానది నుంచి కొందరు ఇసుకను తరలించే క్రమంలో ఇటీవల ఆయకట్టు భూములకు సాగునీరు అందించే కాలువను పూడ్చివేశారు. దీంతో కాలువ ద్వారా సాగునీరు సరఫరా కాకపోవడంతో ఆయకట్టు రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కాలువ పూడ్చిన విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆమె రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలని తెలపడంతో నాయకులు ఆదివారం ఎక్సకవేటర్ ద్వారా కాలువలో పూడికను తీయించి ఆయకట్టు భూములకు సాగునీరు సాఫీగా అందేలా చర్యలు చేపట్టారు. దీంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆయకట్టు భూములకు సాగునీటిని సరఫరా చేసే కాలువలను పూడ్చితే ఎంతటి వారిపైన అయిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సామాల మధు, అంగజాల పుల్లన్న, తిరుపాలు, రామకృష్ణ, ఆనంద్, చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల తనిఖీ

గుత్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు 44వ జాతీయ రహదారిలోని కాశేపల్లి టోల్‌గేట్ సమీపంలో శనివారం రాత్రి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. బెంగళూరు, హైదరాబాదు, నెల్లూరు, విజయవాడ, తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ స్లీపర్ బస్సులను ఆయన తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్, నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు.

సంతల ఆదాయం రూ.2.95 లక్షలు

అనంతపురం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌కు పశువుల సంతల ద్వారా రూ.2.95 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి రాఘవేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1.61 లక్షలు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంత ద్వారా రూ.1.34 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

ఇంకెన్నాళ్లు.. ఈ అవస్థలు?

- గుంతలు పడి, రాళ్లు తేలిన చిన్నంపల్లి రోడ్డు
- దశాబ్దాలు గడిచినా బాగుచేయని వైనం
- ప్రయాణించాలంటే విసుగెత్తిపోతున్న గ్రామస్థులు


గ్రామ సమీపంలో గుంతలు పడి అధ్వానంగా ఉన్న రోడ్డు

అనంతపురంరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. రాకపోకలు సాగించేందుకు గ్రామస్థులు విసుగెత్తిపోతున్నారు. దశాబ్ధాలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా.. బాగు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

ఆ రెండు వందల మీటర్లే అధ్వానం..

అనంతపురం-కళ్యాణదుర్గం ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు కిలో మీటర్‌కు పైగా దూరం ఉంటుంది. ఈ రోడ్డు ఇటీవల కాలంలో చాలా వరకు బాగుపడింది. అయితే గ్రామ దగ్గరలో దాదాపు రెండు వందల మీటర్ల మేర అధ్వానంగా ఉంది. ఆ కొంత దూరం తారు వేయడానికి పాలకులు చొరవ చూపడం లేదు. మట్టి రోడ్డు కావడంతో రాళ్లు తేలి పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. ఆ కొంచెం దూరంలోనే పదుల సంఖ్యలో గుంతలు పడ్డాయి. దీంతో గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షం వస్తే పరిస్థితి దారుణంగా ఉంటోంది.

అభివృద్ధిని అడ్డుకుంటున్న స్థానికులు..

స్థానికంగా కొందరు వ్యక్తులు రోడ్డు వేయడానికి అడ్డు పడుతున్నట్లు, వారి మధ్య నెలకొన్న భూ సమస్య కారణంగా ఆ కొంత మేర రోడ్డు నిర్మాణం ఆగిపోయినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ప్రస్తుతం గ్రామస్థులు రాకపోకలు సాగిస్తున్న రోడ్డు గ్రామంలోకి వచ్చే దారి కాదని, గ్రామంలోకి వచ్చేందుకు గ్రామ కంఠం భూమిలో దారి ఉండేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఆ భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నట్లుగా, ఆక్రమిత భూమికి బదులుగా ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న భూమిలో కొంత మేర దారి కోసం ఇచ్చారని, సదరు భూ ఆక్రమిత వ్యక్తికి సంబంధించిన కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న భూ సమస్యతో రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని సమాచారం. భూమిని రోడ్డుకు రాసిస్తున్నట్లు గతంలో ఎలాంటి రాతలు కూడా లేదు. ఏది ఏమైనప్పటికీ సమస్య గ్రామస్థుల అవసరంతో ముడిపడింది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు సమన్వయంతో చొరవ చూపితే సమస్య పరిష్కారం అయ్యే వీలుంది. ఏఅధికారి కూడా ఆదిశగా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవచూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సమస్యకు పరిష్కారం చూపాలి



నేను సర్పంచుగా అయిన వెంటనే రోడ్డు వేయడానికి ప్రయత్నం చేశా. స్థానికంగా భూ సమస్య తలెత్తడంతో ఆగిపోయా. రోడ్డు సమస్యను పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు అర్జీలు ఇచ్చా. ఇంత వరకు ఎవరూ చొరవ చూపడం లేదు. సమస్యకు పరిష్కారం చూపితే రోడ్డు వేసేందుకు సిద్ధంగా ఉన్నా.

-శివశంకర్, సర్పంచ్, చిన్నంపల్లి

బీకేఎస్ ఎంపీపీ అవిశ్వాసంపై తీవ్ర ఉత్కంఠ

- వైసీపీ, టీడీపీ శిబిరాలకు ఒక్కొక్కరు చొప్పున సభ్యులు డుమ్మా
- ఫలితం ఎవరికి అనుకూలమో?

బుక్కరాయసముద్రం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం ఎంపీపీ అవిశ్వాస తీర్మాణం ఉత్కంఠగా మారింది. టీడీపీ, వైసీపీల మధ్య హోరాహోరీగా పోరు నెలకొంది. ఈ నెల 30వ తేదీన ఎంపీపీ దాసరి సునీత పట్ల జరిగే అవిశ్వాసం తీర్మాణం వీగి పోవాలంటే నిర్ణయించే కీలకమైన ఇద్దరు ఎం పీటీసీ సభ్యులు రెండు పార్టీలలో డుమ్మా కొట్టినట్లు తెలిసింది. సమయం దగ్గర పడుతుండటంతో 13మంది వైసీపీ ఎంపీటీసీ సభ్యులలో ఇప్పటికే 12 మందిని క్యాంపునకు తరలించారు. బీకేఎస్ ఎంపీటీసీ -3 సభ్యురాలు శిరజా మాత్రం అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇక టీడీపీ ఎంపీటీసీ స భ్యులు ఐదుగురు ఉండగా... ఇటీవలే ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడినట్లు తెలిసింది. అలాగే రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వద్దకు ఆ ఐదుగురిలో నలుగురిని పిలుచుకెళ్లి వారికి రాజకీయ భరోసా కల్పించినట్లు సమాచారం. ఎమ్మె ల్యే స్వగ్రామమైన సిద్దరాంపురం ఎంపీటీసీ స భ్యురాలు సాకే నాగలక్ష్మి మాత్రం తొలి నుంచి టీడీపీ శిబిరంలోకి రాలేదు. ఆమె పార్టీ పట్ల అ సంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆదివారం టీడీపీ ఎంపీటీసీ సభ్యులను క్యాంపునకు తరలించినట్లు తెలిసింది. ఇందుకు సాకే నాగలక్ష్మి గైర్హాజరయ్యారు. దీంతో రెండు పార్టీలలో ఒక్కొక్కరు చొప్పున ఎంపీటీసీ సభ్యులు డుమ్మా కొట్టారు. దీని ఫలితం ఎవరికి అనుకూలమో అంతు చిక్కని పరిస్థితి నెలకొంది. అవిశ్వాసం పె ట్టే నాటికి గైర్హాజరైన సభ్యులు ఎటువైపు మొగ్గు చూపుతారో తెలియక ఇరు పార్టీల శ్రేణులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఎంపీటీసీలు డుమ్మా కొట్టడానికిగల కారణాలపై స్థానికంగా రకరకాల ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఈ ఓటింగ్ పక్రియలో ఏదైనా అ నూహ్య పరిణామం జరిగే అవకాశం లేకపోలేదు.

మ్యాజిక్ ఫిగర్ 13 కోసం వైసీపీ ఆరాటం

ఎంపీపీ దాసరి సునీతపై అవిశ్వాసం వీగి పోవాలంటే... తప్పని సరిగా వైసీపీకి 13 మంది ఎంపీటీసీ సభ్యులు కావాల్సిన అవసరం ఉంది. మ్యాజిక్ ఫిగర్ సాధించాలంటే.. ఒక ఎంపీటీసీ సభ్యురాలు అజ్ఞాతంలో పోవడంతో వైసీపీ శిబిరంలో ఆందోళన మొదలైంది. మరో వైపు టీడీపీలో కూడా ఒక ఎంపీటీసీ సభ్యురాలు పార్టీ పట్ల అసంతృప్తితో ఉండి క్యాంపునకు గైర్హాజరయ్యారు. దీంతో టీడీపీ శిబిరంలో ఉత్కంఠ నెలకొంది.

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- పార్టీ శ్రేణులకు వైసీపీ జిల్లా అధ్యక్షుడి సూచన

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అనేక వైఫల్యాలను మూటగట్టుకుంద ని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ జిల్లా అ ధ్యక్షుడు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన రుద్రంపేట, ఏ.నారాయణపురం, రాజీవ్‌కాలనీ, అనంతపురం రూరల్ పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ హయాంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, చేసింది చెప్పుకోలేకపోయామని అన్నారు. అదే కూటమి పాలకులు ఏమీ చేయకపోయినా అంతా తామే చేశామని ప్రచారాలు మాత్రం గట్టిగా చేసుకుంటున్నారని విమర్శించారు. ఈనెల 28న నియోజకవర్గస్థాయిలో జరగాల్సిన ర్యాలీ తుఫాన్ దృష్ట్యా వచ్చే నెల 4వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు. ఆరోజున చేపట్టే ర్యాలీకి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

3 నుంచి శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవాలు



కదిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆర్జిత కల్యాణోత్సవాలు నవంబరు 3వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. నవంబరు 3, 4, 6, 7, 9, 10, 11, 12, 13, 14, 16, 17, 21, 23, 24, 25, 26, 30 తేదీల్లో ఆర్జిత కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. వివరాలు ఆలయ పని వేళల్లో కార్యాలయంలో తెలుసుకోవాలని సూచించారు.

నేడు క్రీడాపోటీలు

శింగనమల, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆకులేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సోమవారం నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్ఎం గోవిందరాజులు, పీఈటీ నగేషబాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో అన్ని కేటగిరి విభాగాల్లోని కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా తదితర క్రీడా పోటీలు జరుపుతామన్నారు. మండలంలోని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుత్తికోట అభివృద్ధికి సహకరించండి

గుత్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకత కలిగిన గుత్తికోట అభివృద్ధికి సహకరించాలని గుత్తికోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌బాస్కర్ చౌదరి తెలంగాణ సీఎస్ రామకృష్ణరావుకు విన్నవించారు. పట్టణంలో కోట ప్రాంతానికి చెందిన సీఎస్ రామకృష్ణ రావు తెలంగాణ రాష్ట్ర ముఖ్యకార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆయనను కలిసిన విజయ్‌భాస్కర్ గుత్తి ప్రాముఖ్యత, కోట పరిపాలన గురించి వివరించారు. కోట అభివృద్ధికి ఏపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

టెట్ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి..


మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆపస్ నాయకులు

అనంతపురం విద్య, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): సర్వీస్ టీచర్లకు టెట్ అనడం సరికాదని, దీనిపై కేంద్రం దృష్టికి తీసికెళ్లాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆపస్ నాయకులు కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆదివారం వారు.. మంత్రిని కలిసి మాట్లాడారు. సర్వీస్ టీచర్లు టెట్ రాయాలని, తప్పనిసరిగా పాస్‌కావాలనే నిబంధనలు పెడుతూ మానసికంగా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఈ పరీక్షకు సంబంధించి షెడ్యూల్ కూడా ఇచ్చారని, దీంతో టీచర్లలో గందరగోళం ఏర్పడిందని అన్నారు. వెంటనే కేంద్రం దృష్టికి తీసికెళ్లి టెట్ గందరగోళం తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. నాయకులు ఎర్రిస్వామి, కల్యాణి, మర్షవర్ధన్, వరదరాజులు, సుదర్శనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి

అనంతపురం విద్య, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్‌ను పూర్తి స్థాయిలో మినహాయించాలని వైఎస్ఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులపతి ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో ఆదివారం సంఘం ప్రధాన బాధ్యుల సమావేశం జరిగింది. ఇందులో ఓబులపతి మాట్లాడుతూ దశాబ్దాలుగా పని చేస్తున్న టీచర్లకు ఇప్పుడు టెట్ నిర్వహించడం సరికాదన్నారు. 35ఏళ్ల పాటు పని చేసిన టీచర్లు వివిధ రోగాలతో ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వరిస్తున్నారని, ఇపుడు వారిని టెట్ రాయలని చెప్పడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అదికూడా ఆన్‌లైన్‌లోనే రాయాలనడం ఎంతవరకు సమంజసమన్నారు. వెంటనే ప్రభుత్వం సర్వీస్ టీచర్లందరికీ టెట్ మినహాయించాలన్నారు. అలాగే పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని, సరెండర్‌లీవ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు గిరిధర్ రెడ్డి, జగదీష్‌రెడ్డి, సురేష్‌కుమార్, వెంకటరెడ్డి, అల్తాఫ్, వీరాంజనేయులు, త్యాగరాజునాయక్, నాగేంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

శింగనమల, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాలలో 1987-1988వ విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు సుమారు 38 ఏళ్ల తరువాత మళ్లీ అదే పాఠశాలలో కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తర్వాత అప్పటి గురువులను స్థానిక ఆత్మారామస్వామి ఆలయం వద్ద నుంచి పాఠశాల వరకు పూల వర్షంతో ఊరేగింపు చేశారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సాయంత్రం వరకూ సరదాగా గడిపారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


జ్యోతులు పడుతున్న కాలనీ వాసులు

అనంతపురంరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిమి కాలనీలో ఆదివారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జ్యోతులు పట్టారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో వాల్మీకి విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, వాల్మీకి కులస్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నత్యం చేస్తున్న కళాకారులు

అనంతపురంరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిల్పారామంలో ఆదివారం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ధర్మవరానికి చెందిన మానస నృత్య కళా కేంద్రం కళాకారుల బృందం సభ్యులు క్లాసికల్, జానపదం నృత్య ప్రదర్శనలు నిర్వహించి అలరించారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి, నృత్య గురువు మానస, కళాకారులు మోక్ష, శాన్వి, చంద్రిక, హేమశ్రీ, యశస్విని, యుక్తశ్రీ, యోషిక, భానుశ్రీ, సుష్మిత, పల్లవి, అనూష, సన, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

యువకుల ధైర్యం స్ఫూర్తిదాయకం

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- కర్నూలు బస్సు ఘటనలో ప్రాణాలను కాపాడిన యువకులకు సన్మానం


యువకులను సన్మానించిన మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఘోర బస్సు ప్రమాద సమయంలో ధర్మవరం యువకులు చూపిన ధైర్యం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ కొనియాడారు. కర్నూలు వద్ద రెండురోజుల క్రితం జరిగిన బస్సు ప్రమాదంలో పదిమందికి పైగా ప్రాణాలను కాపాడిన ధర్మవరం యువకులను మంత్రి సన్మానించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రయాణికులను కాపాడిన హరీశ్‌కుమార్, జ్ఞానేంద్ర, వంశీల ఇళ్లకు వెళ్లి అభినందించి శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో ఉన్న వేళ, తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా బస్సులో చిక్కుకున్న వారిని బయటకు లాగి రక్షించిన ఈ యువకుల చర్య మానవత్వానికి, ధైర్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. సమాజంలో ఇలాంటి ధైర్యవంతులైన యువకులు ఉండటం గర్వకారణం అన్నారు.

వసూళ్లు, ఆక్రమణలు ప్రకాష్‌రెడ్డికే చెల్లు: టీడీపీ

అనంతపురంరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వసూళ్లు, ఆక్రమణలు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికే చెల్లుతాయని టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ విమర్శించారు. పాపంపేటలోని బాలాజీ విల్లాస్‌లో ఆదివారం ఆయన ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ లక్ష్మీదేవి, కుమ్మరశాలివాహన సాధికారసమితి కన్వీనర్ రామాంజినేయులు, రాప్తాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ సాలమ్మ, గ్రామ కమిటీ అధ్యక్షకార్యదర్శులు సైపుల్లాఖాన్, జెట్టి రాము తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పాపంపేట భూ వివాదాన్ని తెరపైకి తెచ్చారన్నారు. తద్వారా తానేదో పాపంపేట ప్రజలను ఉద్దరిస్తున్నట్లు షో చేస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు చేసిన ఆగడాలు ప్రజలు మరచిపోలేదన్నారు. సొంత పార్టీ నాయకులను వాడకుని రోడ్డున పడేసిన అతను పరిటాల కుటుంబంపై నిందలు వేయడం సిగ్గుచేటన్నారు. కేవలం రాజకీయ భవిష్యత్తు కోసమే పాపంపేట ప్రజలను బలిపశువులను చేయాలని చూస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఉన్నంతవరకు పాపంపేటకు, ప్రజలకు అన్యాయం జరగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పేరంహరి, చిరంజీవి, దస్తగిరి, రామాంజినమ్మ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాపంపేట ప్రజలకు పరిటాల కుటుంబం అండ

రాప్తాడు: పాపంపేట ప్రజలకు పరిటాల కుటుంబ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టీడీపీ మండల నాయకులు తెలిపారు. పాపంపేట భూ వివాదంపై మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాపంపేట భూ వివాదం కోర్టులో ఉందనీ, దీని వెనుక పరిటాల కుటుంబం ఉందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తుండడం దారుణమని మండిపడ్డారు. పాపంపేట భూవివాదానికి, పరిటాల కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. రాజకీయ ఉనికి కోసమే ప్రకాష్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పరిటాల కుటుంబం పాపంపేట ప్రజలకు అండగా ఉంటుందని, త్వరలోనే న్యాయం చేస్తుందని అన్నారు. ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేదిలేదని ప్రకాష్‌రెడ్డిని హెచ్చరించారు. మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మండలమాజీ కన్వీనర్ నారాయణస్వామి, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, తెలుగు యువత మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కిష్టా, ఎంపీటీసీ సభ్యుడు జాఫర్, సర్పంచ్ శీనయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ పబ్బం కోసమే అసత్య ప్రచారాలు..

ఆత్మకూరు: రాజకీయ పబ్బం కోసమే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాపంపేట భూ వివాదంపై అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు మండిపడ్డారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సక్షేమం కోసం పరిటాల కుటుంబం పని చేస్తోందని, అది సహించలేని ప్రకాష్‌రెడ్డి అసత్య ప్రచారాలకు తెరలేపారని అన్నారు. పాపంపేటలో ఒక్క సెంటు స్థలం కూడా కబ్జాకు గురికాకుండా అక్కడి ప్రజలకు పరిటాల కుటుంబం అండగా నిలిచిందన్నారు. గత వైసీపీ పాలనలో అనేక అక్రమాలకు పాల్పడింది తోపుదుర్తి కుటుంబమేనని ఆరోపించారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్, పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుళ్లాయప్ప, పలువురు నాయకులు పాల్గొన్నారు.


పాపంపేటలో మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ తదితరులు


రాప్తాడులో మాట్లాడుతున్న మండల కన్వీనర్ కొండప్ప


ఆత్మకూరులో మాట్లాడుతున్న మండల కన్వీనర్ శ్రీనివాసులు

న్యూస్ బాక్స్

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయం వద్ద నాయకులు

పెద్దవడుగూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వీరభద్రస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన ఆలయ నిర్మాణంలో భాగంగా నాయకులు పేరం నాగిరెడ్డి, వీఆర్ రామిరెడ్డి, వీఆర్ వెంకటేశ్వరరెడ్డి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు.

బస్సు ప్రమాద మృతులకు నివాళి

గుంతకల్లుటౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక జితేంద్ర గౌడ్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం కర్నూలు జిల్లా చిన్నటేకూరు గ్రామ సమీపంలో హైదరాబాదు, బెంగళూరు హైవేపై ప్రైవేట్ బస్సు దగ్ధమై ఘటనలో మృతి చెందిన వారికి మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు.

అర్ధ శతాబ్దం తర్వాత అపూర్వ కలయిక



అప్పటి గురువులతో పూర్వవిద్యార్థులు

యాడికి, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): ఇది నిజంగానే అపూర్వ కలయిక. 50ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న 30 మంది పూర్వవిద్యార్థులు ఒక్కచోట కలిశారు. యాడికి హైస్కూల్ ఇందుకు వేదికగా మారింది. 1974-1975 సంవత్సరంలో.. అంటే ఇప్పటికి 50 ఏళ్ల క్రితం యాడికి హైస్కూల్‌లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో 30 మంది పూర్వవిద్యార్థులు కలిశారు. అందరూ కుమారులు, కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లతో హాజరుకావడం గమనార్హం. ఆత్మీయ సమ్మేళనంలో తమ బాల్యంలోని మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శేషారెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఆటపాటలు, డ్యాన్స్‌లతో సరదాగా గడిపారు. మధుర జ్ఞాపకంగా అందరూ కలిసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. యాభైఏళ్ల తర్వాత స్నేహితులు కలవడానికి కృషి చేసిన మహబూబ్‌బాషా, దాసరి క్రిష్ణ, లింగం శేఖర్, సత్యనారాయణ, నల్లప్పను అభినందించారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

యాడికి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో 10వ తరగతి ఫలితాల్లో ప్రతిభచూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాగర్ సిమెంట్స్ యాజమాన్యం ఆదివారం రూ.4.5లక్షల ప్రోత్సాహక నగదు బహుమతులు, సర్టిఫికెట్స్‌ను అందించారు. మొదటి ర్యాంకర్‌కు రూ.25వేలు, రెండో ర్యాంకర్‌కు రూ.15వేలు, మూడో ర్యాంకర్‌కు రూ.10వేల అందజేశారు. సాగర్ సిమెంట్స్ వ్యవస్థాపకులు సమ్మిడి వీరారెడ్డి జ్ఞాపకార్థం బహుమతులు అందజేసినట్లు హెచ్‌ఆర్ డీజీఎం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ రంగారెడ్డి, ఎంఈఓ-2 ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబ్జాలను అరికడతాం: ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కబ్జాలు, ఆక్రమణలను పూర్తి స్థాయిలో అరికడతామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఆదివారం తూర్పుకోడిపల్లిలో మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణ, జయంతి వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మీ అందరి మధ్య వాల్మీకి జయంతి వేడుకలు జరుపుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా కూడా విద్యార్థులు చదువుకు దూరం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. పట్టణంలో ఉన్న కంబదూరు రోడ్డు 30 మీటర్ల వెడల్పుతో ఉండేదని, నేడు పూర్తిగా ఆక్రమణలతో నిండిపోయిందన్నారు. త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు చేపడతామన్నారు. పట్టణంలోని టీ సర్కిల్ నుంచి వాల్మీకి సర్కిల్ వరకు చాలా మంది స్వచ్ఛందంగా అభివృద్ధికి సహకరించి, వారి స్థలాలను ఇచ్చారని వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా కళ్యాణదుర్గం పట్టణానికి తలమానికంగా వాల్మీకి విగ్రహావిష్కరణను అంగరంగం వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఓ విద్యార్థి కళాశాల ఫీజు కోసం రూ.15 వేలు ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే అందచేశారు. మరో విద్యార్థినికి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో హాస్టల్ వసతితో పాటు, ఉచితంగా సీటు ఇవ్వాలని అక్కడికక్కడే ఎమ్మెల్యే యాజమాన్యాన్ని ఆదేశించారు.



విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ఆటో, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

యాడికి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆటో, బైక్ ఢీకొని రమేష్, అనిత అనే ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం రాయలచెరువు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు చందన గ్రామానికి చెందిన రమేష్, అనిత వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై యాడికి గ్రామానికి వచ్చి తిరిగి వెళుతున్న సమయంలో రాయలచెరువు వద్ద వేగంగా వస్తున్న ఆటో ఢీకొన్నట్లు తెలిపారు. ఘటనలో రమేష్, అనిత తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం రాయలచెరువుకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు తెలిపారు. ఆటోలో ఉన్న కూలీలు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

నమాజు చేస్తూ మౌజన్ మృతి

పామిడి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సున్ని జామియా మసీదులో మౌజన్‌గా పనిచేస్తున్న మహబూబ్ బాషా (49) ఆదివారం సాయంత్రం నమాజు చేస్తూ మృతిచెందారు. స్థానికులు తెలిపిన మేరకు టీచర్స్ కాలనీలో నివాసముంటున్న మహబూబ్ బాషా ఏడేళ్లుగా సున్ని జామియా మసీదులో మౌజన్‌గా పనిచేస్తున్నారు. రోజు మాదిరిగానే సాయంత్రం నమాజు చేస్తూ నేల కొరిగిపోయారు. తోటివారు గమనించి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గుండె నొప్పి కారణంగా ఆయన మృతిచెందినట్లు తెలుస్తోంది. ముస్లింలు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరుచింతల గ్రామ సమీపంలో కొండపై పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ ధరణీబాబు సిబ్బందితో కలిసి శనివారం దాడులు చేశారు. దాడిలో 14మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,66,150 స్వాధీనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 9సెల్‌ఫోన్లు, నాలుగుకార్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు.

శెట్టూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మంపల్లి గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు.వారి నుంచి రూ.9,800, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రేపు అభివృద్ధి పనులకు భూమిపూజ

తాడిపత్రి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 28వ తేదీన పలు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. సంజీవనగర్‌లోని సాయిబాబా ఆలయం వద్ద రూ.34లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద రూ.18లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులకు భూమిపూజ చేయనున్నారు. నంద్యాలరోడ్డు విశాల్ మార్ట్ వెనుక భాగంలో రూ.36లక్షల వ్యయంతో తాగునీటి పైప్‌లైన్‌కు ఎమ్మెల్యే భూమిపూజ చేస్తారని తెలిపారు.

అల్లుడిపై మేనమామ దాడి

గుత్తిరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు గ్రామంలో ఆదివారం అల్లుడిపై మేనమామ కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన పుల్లన్న తన భార్య భవానికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మేనత్తను సరిగా చూసుకోలేదని హరి మేనమామను మందలించాడు. పుల్లన్న, హరి మాట మాట పెంచుకొని ఘర్షణ పడ్డారు. పుల్లన్న ఇంటిలో నుంచి కత్తి తీసుకువచ్చి హరి కడుపులోకి పొడిచాడు. వేంటనే కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

హగరి నది వద్దకు వెళ్లొద్దు

బెళుగుప్ప, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బీటీపీ నుంచి నీరు విడుదల చేస్తుండటంతో మండలంలోని హగరి నది పరివాహక ప్రాంతంలోకి వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. రమణేపల్లి, గుండ్లపల్లి, శ్రీరంగాపురం, బ్రాహ్మణపల్లి, నరసాపురం గ్రామాలు.. నది పరివాహక సమీపంలో వున్నాయి. ప్రజలు నదిలోకి వెళ్లకుండా డప్పు వేయించామని తెలిపారు.

తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలు

ఉరవకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మొక్కజొన్న, కంది పంటలు దెబ్బతిన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ఉరవకొండ డివిజన్‌లో 1300హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగు చేశారు. పంట నూర్పిడి చేసి, ఆరబెట్టగా వర్షాలకు పంట తడిసిపోయి మొలకలు రావడంతో పాటు విత్తనాలు బూజు పట్టాయి. ధరలు తగ్గడంతో పాటు వర్షం రావడంతో పంట దెబ్బతిని నష్టం వాటిల్లిందని రైతులు అనిల్, రాజేష్ తెలిపారు.

పప్పుశనగ రైతుల్లో ఆందోళన

యల్లనూరు(ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు పప్పుశనగ విత్తిన రైతుల్లో ఆందోళన మొదలైంది. సుమారు 5000ఎకరాల్లో పప్పుశనగ పంటను సాగుచేశారు. యల్లనూరు, వెంకటాద్రిపురం, కృష్ణాపురం, జంగంపల్లి, పాతపల్లి, కాచర్లకుంట, వెన్నపూసపల్లి గ్రామాల్లో 10రోజులక్రితం విత్తనం వేశారు. కొన్నిపొలాలు మొలకత్తగా, మరికొన్ని పొలాలు ఇంకా మొలకెత్తలేదు. ఇప్పటికే విత్తిన భూముల్లో తేమశాతం అధికంగా ఉండడం, కొన్ని పొలాల్లో నీరు నిలిచి తుపాన్ ప్రభావం మండలంపై ప్రభావం చూపితే ఇక్కడ సాగుచేసిన పప్పుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.



తడిసిపోయిన మొక్కజొన్నను ఆరబోసిన దృశ్యం

ఆదర్శ పాఠశాల అధికారులపై చర్యలు తీసుకోండి

విడపనకల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, వార్డన్, ట్యూటర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు హరిప్రసాద్‌యావ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం ఆదర్శ పాఠశాలలోని బాలికల హాస్టల్‌ను ఆయన తనిఖీ చేసేందుకు వెళ్లారు. బాలికల హాస్టల్‌లో ఒక్క అధికారి కూడా లేక పోవటం కనీసం లోపలికి కూడా వెళ్లనివ్వకుండా బయటనే నిలబెట్టి మాట్లాడటంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. హాస్టల్ చుట్టూ ప్రహరీ లేక పోవటంతో రాత్రి సమయంలో విద్యార్థినులు భయం భయంగా కాలం గడుపుతున్నారన్నారు. హాస్టల్‌లో బాధ్యతగా ఉండాల్సిన అధికారులు రాత్రి సమయంలో ఒక్కరూ ఉండటం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హాస్టల్ అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్, గుంతకల్లు ఆర్డీఓ దృష్టికి తీసుకెళతానన్నారు.



తలుపు బయట నుంచే విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న హరిప్రసాద్ యాదవ్

గుత్తికోట అభివృద్ధికి సహకరించండి

● తెలంగాణ సీఎస్‌కు వినతి

గుత్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకత కలిగిన గుత్తికోట అభివృద్ధికి సహకరించాలని గుత్తికోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ చౌదరి.. తెలంగాణ సీఎస్ రామకృష్ణరావుకు విన్నవించారు. పట్టణంలో కోట ప్రాంతానికి చెందిన సీఎస్ రామకృష్ణరావు తెలంగాణ రాష్ట్ర ముఖ్యకార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆయనను కలిసిన విజయ్‌భాస్కర్ గుత్తి ప్రాముఖ్యత, కోట పరిపాలన గురించి వివరించారు. కోట అభివృద్ధికి ఏపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని విజ్ఞప్తి చేశారు.



సీఎస్‌ను కలిసిన విజయభాస్కర్ చౌదరి

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

బ్రహ్మసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో 23, 24 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించిన అం డర్-19 అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సం వత్సరం చదువుతున్న విద్యార్థిని శకుంతల ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చంద్రమౌళి తెలిపారు. ట్రిపుల్ జంప్‌లో మొదటి స్థానం, వంద మీటర్ల పరుగులో రెండో స్థానం, లాంగ్ జంప్‌లో మూడో స్థానం, 400 రిలేలో రెండో స్థానంలో నిలిచి నాలుగు పతకాలు సాధించిందన్నారు. విద్యార్థినిని అధ్యాపకులు, విద్యార్థినులు అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థిని శకుంతలతో ఉపాధ్యాయులు

బస్సుల తనిఖీ

గుత్తి, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు 44వ జాతీయ రహదారిలోని కొశేపల్లి టోల్‌గేట్ సమీపంలో శనివారం రాత్రి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. బెంగళూరు, హైదరాబాదు, నెల్లూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ స్లీపర్ బస్సులను ఆయన తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్, నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు.



స్లీపర్ బస్సులో అగ్నిమాపక యంత్రాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ